## క్లుప్తంగా

### సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌లో టీజేపీఎస్ విద్యార్థి ప్రతిభ



**గుంటూరు ఎడ్యుకేషన్:** ఏఎన్‌యూలో ఇటీవల జరిగిన సౌత్‌జోన్, నేషనల్ అథ్లెటిక్స్ పోటీల్లో టీజేపీఎస్ కళాశాల బీకాం ప్రథమ సంవత్సర విద్యార్థి షేక్ రోషన్ ప్రతిభ చూపారని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి తెలిపారు. పట్టాభిపురంలోని కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 100 మీటర్ల పరుగు పందెంతో పాటు 110 మీటర్ల హార్డిల్స్‌లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలను సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, వ్యాయామ అధ్యాపకుడు ఆర్.శివాజీ, కోచ్‌లు కె.కృష్ణమోహన్, రవి పాల్గొన్నారు.

### బౌద్ధ ధర్మాలపై ఆధ్యాత్మిక ప్రవచనం



**నగరంపాలెం:** స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై గురువారం ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సిహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పువ్వాడ తిక్కన సోమయాజి విరచిత ఆమ్రపాలి కావ్యంలోని బౌద్ధ ధర్మాలపై డాక్టర్ ఎన్‌సీహెచ్ సుధామైథిలి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. సుధామైథిలి ప్రసంగిస్తూ మానవులకు భక్తి భావం, వైరాగ్య భావాలు కలిగి ఉండాలని అన్నారు. మితిమీరిన కోరికలు, అనర్థాలకు కారకాలని పేర్కొన్నారు. మానవాళికి కలిగించే శ్రేయస్సుపై, మానవులు ఆధ్యాత్మిక ఆచరణకు చేయాల్సిన ఆవశ్యకతపై వివరించారు.

### బదిలీపై వెళ్తున్న ఆర్ఐలకు సత్కారం



**నగరంపాలెం:** ఎన్నికల వేళ, సాధారణ విధి నిర్వహణలో సమర్థవంతంగా పనిచేశారని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. బదిలీపై వెళ్తున్న జిల్లా ఏఆర్ ఆర్ఐలు శ్రీనివాసరావు, బ్రహ్మానందంను గురువారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, డీఎస్పీలు శాంతకుమార్ (ఏఆర్), బి.సీతారామయ్య (ఎస్‌బీ), ఆర్ఐలు హరిరెడ్డి, శివరామకృష్ణ, ఆర్ఎస్ఐలు, ఏఆర్ ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

### స్క్రీనింగ్ పరీక్షలతో క్యాన్సర్‌ను నిరోధించవచ్చు

మెడికల్ క్యాంపులో డాక్టర్ షమా సుల్తానా



**గుంటూరు మెడికల్:** స్క్రీనింగ్ పరీక్షలతో క్యాన్సర్‌ను నిరోధించవచ్చని హోప్‌విన్ హాస్పటల్స్ చైర్‌పర్సన్, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తానా అన్నారు. అక్టోబర్ క్యాన్సర్ అవగాహన మాసోత్సవం సందర్భంగా హోప్ విన్ హాస్పిటల్, ఒమేగా హాస్పటల్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గుంటూరు నగరంలోని బారా ఇమామ్ పంజా సెంటర్‌లో ఉన్న హోప్ విన్ హాస్పిటల్ ఓపీడీ క్లినిక్‌లో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. మెడికల్ క్యాంపులో డాక్టర్ షమ సుల్తానా సుమారు 100 మంది రోగులకు బీపీ, బ్లడ్ షుగర్ టెస్ట్, పాప్ స్మియర్, మామోగ్రఫీ తదితర పరీక్షలు ఉచితంగా చేశారు. సర్వైకల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ పై అవగాహన కల్పించారు. ఉచితంగా మందులు అందజేశారు.

### బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ సాధించిన ఏసీ కళాశాల



**గుంటూరు ఎడ్యుకేషన్:** ఏఎన్‌యూలో ఈనెల 22,23వ తేదీల్లో జరిగిన అంతర్ కళాశాలల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో ఏసీ కళాశాల జట్టు శ్రీదారపనేని వెంగయ్య మెమోరియల్ ఎవర్ రోలింగ్ సిల్వర్ ట్రోఫీ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్ తెలిపారు. గురువారం సాంబశివపేటలోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ టీంను అభినందించారు. కళాశాల బోర్డు చైర్మన్ డాక్టర్ ఎంఎస్ శ్రీధర్, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ పీఎం వినయతేజ, గణితశాస్త్ర. వ్యాయామవిద్య విభాగాధిపతులు విజయకుమార్, డాక్టర్ జీపీ ప్రీతమ్ ప్రకాష్ పాల్గొన్నారు.

# పీకల లోతు కష్టం!

- రోగాల బారిన పీకల వాగు పరిసర వాసులు
- భరించలేని దుర్గంధం
- కాల్వలో పేరుకు పోతున్న చెత్త, మురుగు
- చోద్యం చూస్తున్న నగరపాలక సంస్థ అధికారులు



34వ డివిజన్ కోబాల్ట్‌పేట 5వ లైన్‌లోని పీకల వాగులో పేరుకు పోయిన మురుగు, చెత్త

**లక్ష్మీపురం:** గుంటూరు నగరపాలక సంస్థ 34, 35, 36 డివిజన్‌ల పరిధిలో పీకల వాగు సమీప నివాసులు నిత్యం రోగాల బారిన పడాల్సిన దుస్థితి నెలకొంది. ఈ మూడు డివిజన్‌లలో పలు రకాల కూలీ పనులు చేసుకునే వారి నుంచి వ్యాపారులు, జిల్లా స్థాయి అధికారుల వరకు నివాసం ఉంటారు. ఈ ప్రాంతంలో పారిశుద్ధ్య సమస్యలతో స్థానికంగా నివాసం ఉండే వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

#### దోమలకు ఆవాసంగా..

బృందావన్ గార్డెన్స్ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ వెనుక వైపు నుంచి దేవాపురం, కోబాల్ట్‌పేట, బ్రాడీపేట మీదుగా పీకల వాగులో మురుగు ప్రవహిస్తుంది. ఈ వాగులో మురుగు సకాలంలో తొలగించక పోవడంతో సిల్ట్ నిల్వ చేరుతుంది. దీంతో వాగు వెంట వచ్చే చెత్త, జంతు కళేబరాలు సైతం ఆయా ప్రాంతాల వద్దకు చేరుతున్నాయి. దీని వల్ల తీవ్ర దుర్గంధం నెలకొంటోంది. పీకలవాగు దోమలు, ఈగలకు ఆవాసంగా మారగా తామంతా వివిధ రోగాలతో ఆస్పత్రుల పాలవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

#### భరించలేని దుర్గంధం..

పీకల వాగు నుంచి వెలువడే దుర్గంధానికి తాము ఈ ప్రాంతంలో నివశించలేకపోతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. స్థానికులు మరోచోటకి పోలేక, రోగాలతో సతమతమవుతూ ఉంటున్నారు తప్పితే బయట ప్రాంతాల నుంచి ఇక్కడ ఇళ్లు కొన్న వారు, అద్దెకు వచ్చిన వారు రోజుల వ్యవధిలోనే ఇక్కడి నుంచి వెళ్లిపోతున్నారంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ప్రజా ప్రతినిధులు వచ్చిన సమయంలో మాత్రమే పారిశుద్ధ్య సిబ్బంది అక్కడక్కడ వాగులో సిల్ట్ తీయడం వంటివి తూతూ మంత్రంగా చేసి వెళ్లిపోతారని మళ్లీ రోజుల తరబడి కనిపించరని స్థానికులు వాపోతున్నారు. అదేవిధంగా వాగులో సిల్ట్‌ను తొలగించి, దాన్ని రోడ్లపై అలాగే వదిలేస్తారని, కనీసం దాన్ని తరలించే ప్రయత్నం చేయరని వాపోతున్నారు.

#### సైడ్ డ్రైన్లలో మురుగు ఇళ్ల ముందే..

ఆయా డివిజన్‌లలో మురుగు కాల్వల్లో సిల్ట్‌ను వారంలో రెండుసార్లు మాత్రమే తీస్తారని, మిగతా రోజుల్లో పట్టించుకోరని స్థానికులు చెబుతున్నారు.

వర్షం కురిసినప్పుడు వర్షం నీరు, సైడ్ డ్రైన్లలోని మురుగు కలిసిపోయి రోడ్లపై నిలిచి పోతాయని దీంతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా దోమల ధాటికి జ్వరాల పాలవుతున్నామని అంటున్నారు. అధికారులు ఇప్పటికైన స్పందించి పీకలవాగును పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి ఎప్పటి కప్పుడు సిల్ట్‌ను తీయించాలని, అదేవిధంగా సైడ్ డ్రెయిన్లను నిత్యం శుభ్రం చేయించి, నివాస గృహాల ముందు సిల్ట్ లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## మధుమేహంపై అవగాహన అవసరం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ టి. సేవకుమార్, టి.ధనుంజయరెడ్డి, తదితరులు

**గుంటూరు మెడికల్:** దేశంలో పెరిగిపోతున్న మధుమేహ బాధితుల నియంత్రణ, నిరోధం లక్ష్యంగా ప్రతి సంవత్సరం నవంబర్‌ను ప్రపంచ మధుమేహ నిరోధక మాసంగా జరుపుకోవడం జరుగుతుందని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ తాతా సేవకుమార్ అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్ఓ సమావేశ మందిరంలో గురువారం మధుమేహం – లక్షణాలు – నిర్ధారణ – చికిత్స విధానాలు – నిరోధక చర్యలపై ప్రచురించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా డాక్టర్ టి.సేవకుమార్ మాట్లాడుతూ సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో మధుమేహం బారిన పడకుండా నియంత్రించేందుకు ఉచిత వైద్యశిబిరాలు, శాస్త్రీయ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మధుమేహంపై శాస్త్రీయ అవగాహన సభలు, సమావేశాలు ఏర్పాటు చేయదలచుకున్న స్వచ్ఛంద సంస్థలు, వాణిజ్య సంస్థలు, కళాశాలల ప్రతినిధులు 9848391212 నంబరులో సంప్రదించవచ్చన్నారు. తమ సంస్థలు నవంబర్ నెలలోని 4 ఆదివారాలతో పాటు నవంబర్ 14వ తేదీతో కలిపి మొత్తం ఐదు ప్రజా చైతన్య కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, రాయితీతో డయాబెటిక్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి.ధనుంజయరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్ఓ మేనేజర్ పి.నిర్మల రాణి, నేస్తం వ్యవస్థాపకుడు జలీల్ అహ్మద్, యోగా శిక్షకులు కె.వెంకట నాగేంద్రప్రసాద్, కె.రమణ, ఎస్.రాఘవేంద్ర, ఎస్‌హెచ్ఓ సిబ్బంది, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## సత్తాచాటిన క్రీడాకారులకు అభినందనలు



వాలీబాల్ బాలబాలికల జట్లతో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, రవి, కోచ్‌లు

**గుంటూరు ఎడ్యుకేషన్:** రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో గుంటూరు జిల్లాలోని జెడ్పీ హైస్కూళ్లలో చదువుతున్న బాల, బాలికలు రాష్ట్రస్థాయిలో సత్తా చాటి, జాతీయ స్థాయికి ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అన్నారు. హిందూపురంలో ఈనెల 21,22,23వ తేదీల్లో జరిగిన అండర్–17 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికల టీం ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, బాలుర టీం ద్వితీయస్థానంలో నిలిచిన సందర్భంగా గురువారం జెడ్పీ ఆవరణలోని క్యాంపు కార్యాలయంలో క్రీడాకారులను ఆమె అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లో పోటీతత్వంతో ముందుకెళ్లి, రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటడం అభినందనీయమన్నారు. జెడ్పీ పాఠశాలల విద్యార్థులను చదువుతో పాటు క్రీడల దిశగా ప్రోత్సహించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు చేస్తున్న కృషికి నిదర్శనంగానే ఈ విజయాన్ని అందుకున్నారని అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మెల్లంపూడి రవి, గుంటూరు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు చంద్ర వినయ్‌కుమార్, టీం కోచ్ మేనేజర్‌లు తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## మద్యం సిండికేట్ల కోసం మమ్మల్ని బలిచేశారు

- వైఎస్ జగన్ ఉద్యోగాలు కల్పిస్తే...ఈ ప్రభుత్వం ఉద్యోగాలు ఊడబీకి కుటుంబాలను రోడ్డు పాలు చేశారు
- సోమవారం నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసన..త్వరలో అసెంబ్లీ ముట్టడికి కార్యచరణ
- ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ హెచ్చరిక



మంగళగిరి స్టేట్ ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అసోసియేషన్ నాయకులు

**నెహ్రూనగర్:** మద్యం సిండికేట్ల కోసం మా జీవితాలను సీఎం చంద్రబాబు తాకట్టు పెట్టారని ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త మద్యం పాలసీ పేరుతో గత ప్రభుత్వం తమకు కల్పించిన ఉద్యోగాలను కేవలం మద్యం సిండికేట్ల కోసం తొలగించడంపై మంగళగిరి స్టేట్ ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పవన్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో సుమారు 15వేల మంది ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసేందుకుగాను జిల్లా కలెక్టర్ల ద్వారా రిక్రూట్‌మెంట్ అయ్యామని.. గత 5 సంవత్సరాలుగా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నామన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ పేరుతో ప్రైవేట్ మద్యం దుకాణాలను అందుబాటులోకి తీసుకువచ్చి తమ ఉద్యోగాలను నిర్దాక్షిణ్యంగా తొలగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇటీవల ఎక్సైజ్ శాఖ కమిషనర్, ఎండీని కలిసినప్పుడు మిమ్మల్ని వేరే డిపార్ట్‌మెంట్‌లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో సర్దుబాటు చేస్తామని, మీకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ నెల 24వ తేదిన మీ ఉద్యోగాల విషయమై చర్చిద్దామని...అప్పటి దాకా ఎటువంటి ధర్నాలు, నిరసనలు చేయవద్దని చెప్పారని వివరించారు. తీరా 24వ తేదీ వచ్చిన తరువాత ఏ డిపార్ట్‌మెంట్‌లో సర్దుబాటు చేయకపోగా.. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ డెలివరీ బాయ్‌లుగా చేయాలంటూ సూచిస్తున్నారని మండిపడ్డారు. జగన్ ముందు చూపుతో మాలాంటి నిరుద్యోగులకు జీవనోపాధి కల్పిస్తే...40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు ఈ రోజు మా ఉద్యోగాలను తొలగించి..మమ్మల్ని మా కుటుంబాలను రోడ్డు పాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగాలకు భద్రత కల్పించాలని డిమాండ్‌తో వచ్చే సోమవారం నుంచి ప్రతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేయడంతో పాటు చలో అసెంబ్లీ నిర్వహిస్తామని హెచ్చరించారు.

## 'యువ' సందడి



బొమ్మలు గీస్తున్న విద్యార్థినులు



విద్యార్థినికి మేకప్ వేస్తున్న దృశ్యం



యువజనోత్సవాల్లో సందడి చేస్తున్న యువతులు



సందడి చేస్తున్న యువత

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో యువజనోత్సవాలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మ్యూజిక్, థియేటర్ ఆర్ట్స్ పోటీలలో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలు కళాశాలల నుంచి హాజరైన విద్యార్థులు ఆడుతూ పాడుతూ సందడి చేశారు.

– ఏఎన్‌యూ



ఆలోచింపజేసిన మూకీ ప్రదర్శన

## చెత్త తరలింపు వాహనాలు కేటాయించాలి

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

**నెహ్రూనగర్:** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రతి శానిటరీ డివిజన్ ఇన్‌స్పెక్టర్, ట్రాక్టర్, డ్రైవర్లకు మ్యాపింగ్ చేసి చెత్త తరలింపు వాహనాలు కేటాయించాలని ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం కమిషనర్ కేవీపీ కాలనీలోని నగరపాలక సంస్థ వెహికల్ షెడ్‌ని ఆకస్మికంగా తనిఖీ చేసి, డ్రైవర్లు, పర్యవేక్షణ అధికారులు సకాలంలో హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసి, వాహనాల నిర్వహణ, పారిశుద్ధ్య విభాగానికి వాహనాలు కేటాయించడంపై తగు ఆదేశాలు జారీ చేశారు. తొలుత వెహికల్ షెడ్‌లో నిర్దేశిత సమయానికి పూర్తి స్థాయిలో డ్రైవర్లు, పర్యవేక్షణ చేసే ఏఈ విధులకు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని పర్యాయాలు చెప్పినా పనితీరులో మార్పు కనబడడం లేదని, ఇక నుంచి ఉదయం 5 గంటలకు హాజరుకాకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వెహికల్ షెడ్ లో డ్రైవర్ల హాజరుకి రిజిస్టర్ మెయింటెయిన్ చేయాలన్నారు. వాహనాల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన జరగాలన్నారు. ఈ–ఆటోల నిర్వహణకు సదరు కాంట్రాక్ట్ ఏజన్సీ రెండు రోజుల్లో తగిన ఏర్పాట్లు చేయకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఈని ఆదేశించారు. పర్యటనలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, సీఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్‌ఓలు డాక్టర్ రవిబాబు, రాంబాబు, రామారావు, ఆనందకుమార్, డీఈఈ సతీష్, ఏఈ రవికిరణ్ పాల్గొన్నారు.

## మెగా జాబ్‌మేళాలో 146 మందికి ఉద్యోగాలు



**గుంటూరు ఎడ్యుకేషన్:** మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో గురువారం సమర్థనం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కోసం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 146 మంది అభ్యర్థులు వివిధ ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా జాబ్ మేళాను ప్రారంభించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.మల్లిఖార్జునప్రసాద్ మాట్లాడుతూ 32 ప్రముఖ కంపెనీలు పాల్గొన్న మేళాలో 406 మంది అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు. అభ్యర్థులకు వివిధ దశల్లో ఎంపికను నిర్వహించిన ఆయా కంపెనీల ప్రతినిధులు 146 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, ఐవోబీ కొత్తపేట శాఖ ఏజీఎం జీవీ ప్రదాన్, జిల్లా ఉపాధి అధికారి కె. రమాదేవి, సమర్థనం ట్రస్ట్ ప్రతినిధులు ఎంఆర్‌కే పరమహంస, ఇ. సెంథిల్, బి. రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త రైల్వేలైన్‌కు ఆమోదం సంతోషకరం

డీఆర్ఎం ఎం.రామకృష్ణ



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ

**లక్ష్మీపురం:** దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ), రైల్వే మంత్రిత్వ శాఖ రైల్వే ప్రాజెక్టులను ఆమోదం చేసిన వాటిలో అమరావతికి కొత్త లైన్ కనెక్టివిటీకి ఆమోదం పలుకుతూ రూ.2,245 వేల కోట్లను మంజూరు చేయడం సంతోషదాయకంగా ఉందని గుంటూరు రైల్వే డీఆర్ఎం ఎం.రామకృష్ణ అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డీఆర్ఎం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన రైల్వే కేంద్ర మంత్రి, దక్షిణ మధ్య రైల్వే జీఎం, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలో వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం డీఆర్ఎం విలేకరులతో మాట్లాడుతూ క్యాబినెట్ ఆమోదంలో కొత్త లైన్ ప్రతిపాదన ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిత రాజధాని 'అమరావతి'కి ప్రత్యక్ష కనెక్టివిటీని అందిస్తుందన్నారు. గుంటూరు రైల్వే ఏడీఆర్ఎం కె.సైమన్, సీపీఎం మనోహర్‌రెడ్డి, సీనియర్ డీఈఎన్ కో–ఆర్డినేటర్ జె.వి.అనుషా, సీనియర్ డీసీఎం డాక్టర్ సిహెచ్ ప్రదీప్‌కుమార్, సీనియర్ డీఓఎం ఎం.దినేష్‌కుమార్, సీనియర్ డీఎస్‌టీఈ రత్నాకర్, సీనియర్ డీఎస్‌టీఈ జి.సూర్యనారాయణ, సీనియర్ డీఎఫ్ఎం అమూల్య బి.ఎ.రాజ్ తదితరులు పాల్గొన్నారు.

### మోదీకి బీజేపీ నేతల ధన్యవాదాలు

**గుంటూరు మెడికల్:** అమరావతి రాజధానికి రైల్వే స్టేషన్‌ను, రైల్వేలైన్ నిర్మాణానికి నిధులు విడుదల చేసిన ప్రధాని నరేంద్రమోదీకి బీజేపీ నేతలు ధన్యవాదాలు తెలిపారు. కృష్ణా నదిపై వంతెనను నిర్మించడం కోసం నిధుల విడుదల తదితర అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేసి రాష్ట్రాభివృద్ధికి కృషి చేసినందుకు బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.పాండురంగవిఠల్‌తోపాటు బీజేపీ నేతలు గురువారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. నిధుల విడుదల కోసం కృషి చేసిన రైల్వే శాఖ మంత్రి వైష్ణవ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడులకు ధన్యవాదాలు తెలిపారు.

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



స్థానికులతో మాట్లాడుతున్న ఎస్‌హెచ్ఓ

**లక్ష్మీపురం:** చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ జయరామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక కృష్ణబాబు కాలనీ 21వ డివిజన్‌లో నగరంపాలెం పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్ఓ వీరానాయక్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు గురువారం రాత్రి వారధి కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ యువత గంజాయి, మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్నారన్నారు. అలాంటికి దూరంగా ఉండాలన్నారు. కృష్ణబాబు కాలనీ ప్రాంతంలో అసాంఘీకార్యకలాపాలకు పాల్పడే సంఘటనలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. నగరంపాలెం సీఐ వీరానాయక్ మాట్లాడుతూ ఎవరికైనా చట్టపరమైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. ఇటీవల కాలంలో చోరీలు, చైన్ స్నాచింగ్‌లు ఎక్కువగా జరుగుతున్నందున అనుమానితులు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం ప్రజలకు పలు సూచనలు, హెచ్చరికలు చేశారు. డీఎస్పీ వెంట స్టేషన్ సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన ఆహారం అందించాలి



వంటగదిని పరిశీలిస్తున్న కార్యదర్శి లీలావతి

**నగరంపాలెం:** విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు, వారిని జాగ్రత్తగా చూసుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి టి.లీలావతి అన్నారు. ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు గుంటూరు నగరంలో నిర్వహిస్తోన్న ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలలో గురువారం తనిఖీలు నిర్వహించారు. రాజాగారితోట ఒకటో వీధి, శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరం రోడ్డు, ఏసీ కళాశాల ఎదురు, స్టాల్ బాలికల ఉన్న పాఠశాల ఆవరణలో, జూట్‌మిల్లు ఎదురు నెలకొన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాలలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. విద్య , వైద్యం, ఇతర మౌలిక సదుపాయాలపై బాలికలతో మాట్లాడారు. సదుపాయాల్లో ఏవైనా లోపాలు ఉన్నట్లయితే నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ హెల్ప్‌లైన్ నంబర్ 15100కు సమాచారం అందించాలని సూచించారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**కొరిటెపాడు(గుంటూరు):** 11 కేవీ లైన్ మెయింట్‌నెన్స్, చెట్లు తొలగించడానికి శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు డీ–8 పరిధిలోని చంద్రమౌళినగర్ 5వ లైన్ నుంచి 7వ లైన్‌వరకు లైన్ క్లియర్ తీసుకోవడం జరిగిందని టౌన్–2 డీఈఈ ఎస్.గురవయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాలలో పైన తెలిపినవిధంగా విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.